క్లుప్తంగా

నేడు వట్టెంకు త్రిపుర గవర్నర్ రాక

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మంగళవారం రానున్నారని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చారకొండ: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆవరణంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. యువత సరైన మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌సీలు శ్రీశైలం గౌడ్, తిరుమల్ రావు, సిబ్బంది ఆంజనేయులు, మల్లేష్, అరుణాచలం, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



చారకొండ: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి మండలంలోని సిర్సనగండ్ల, రామచంద్రపురం గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలో డీఈ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. చిన్న వర్షం, గాలి వచ్చిన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విన్నవించారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, కొండారెడ్డి, సురేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మరమ్మతు పనులు

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో బలోపేతంలో భాగంగా అమ్మబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.25 వేలు మంజూరు చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పాఠశాలలో మరమ్మతు పనులను చేస్తున్నామని పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ తెలిపారు. సోమవా ఎంపీడీఓ జ్యోతి పరోసియా మరమ్మతు పనులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే



చారకొండ: గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి గణేష్ ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వద్ద లబ్ధిదారులతో పూర్తి వివరాలను సేకరించారు. సర్వేను ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఎంపీఓ వెంకటేష్ పరిశీలించారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నెల రోజుల నుంచి కొనసాగుతున్న తైక్వాండో శిక్షణ సోమవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరీక్షలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు వారి ప్రతిభను కనబర్చి బెల్టులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. కార్యక్రమంలో మాస్టర్ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



కల్వకుర్తిరూరల్: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం విద్యాదాత పురస్కారాలు, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా పాఠశాల విద్యా కమిషనర్ దేవసేన, డా బీవీఆర్ మోహన్‌రెడ్డి, వెనకబడిన తరగతుల శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డిలు హాజరయ్యారు. నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించినట్లు స్వర్ణభారతి కళానిలయం వ్యవస్థాపకులు నారోజుమోహన్ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

- కనిపించని సూచిక, హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తుమ్మలసూగూర్‌లో..



తిరుమలాపూర్‌కు వెళ్లే రహదారిలో..



అంతారం దగ్గర ప్రమాదకర మలుపు

తాడూరు: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మలుపులు ప్రమాదకరంగా దర్శనిమిస్తున్నాయి. మలుపుల వద్ద తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మలుపు ఉన్న ప్రదేశాలలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద కంప చెట్లను తొలగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూచిక బోర్డులు లేక ప్రమాదాలు

మండలంలోని ఆయా గ్రామాలను కలిపే లింక్ రోడ్డుల పరిస్థితి దారుణంగా ఉంది. పేరుకే ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించినప్పటికి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినా పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు.

మండలంలో ఇలా..

మండలంలోని ఇంద్రకల్ నుంచి తుమ్మలసూగూర్ మీదుగా బిజినేపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు యత్మాతాపూర్ దగ్గర అనేక మలుపులు తిరిగి ఉండడంతోపాటు రోడ్డుకు ఇరువైపుల గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా చెర్లిటిక్యాల నుంచి తిరుమలాపురం వెళ్లే రోడ్డు మలుపులు తిరిగి ఉండడంతోపాటు మలుపుల దగ్గర అనుసరించుకొని ఉన్న కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. మండలంలోని ఐతోల్ నుంచి శిర్సవాడ, పాపగల్ మీదుగా జడ్చర్లకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు శిర్సవాడ సమీపాన మలుపులు తిరిగి ఉంది. అదేవిదంగా మండల కేంద్రం నుంచి గగ్గలపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గగ్గలపల్లి దగ్గర అనేక మలుపులు తిరిగి ఉండడంతోపాటు నెల రోజుల కిందట ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. ఇకనైనా అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ఆయా రోడ్లను పరిశీలించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు మలుపుల వద్ద చాలా మంది వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వచ్చిన వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలి.

– యాదయ్య, అంతారం

మలుపులను పరిశీలిస్తాం

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఉన్న మలుపులు పరిశీలిస్తాం. సూచిక బోర్డులను ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపడుతాం. గతంలో ఏర్పాటు చేసిన బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

–ఉపేందర్‌రెడ్డి, ఏఈ

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ



కల్వకుర్తి ఎమ్మార్సీ నుంచి పాఠ్య పుస్తకాలను తీసుకెళ్తున్న ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు



పెంట్లవెల్లిలో దుస్తువులను పంపిణీ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు



కొల్లాపూర్‌లో..

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను ఎంఈఓ బాసునాయక్ అందించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాలలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలతో పాటుగా, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని ప్రతి పాఠశాలకు 1200 జతల దుస్తులను పాఠశాలలకు మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏపీఎం గౌస్‌ద్దీన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల అధ్యక్షులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల విద్యా వనరుల కేంద్రం వద్ద పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, ఏకరూపు దుస్తువులను ఎంఈఓ చంద్రుడు ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటయ్య, ఏపీఎం అరుణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఆయా ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈఓ శంకర్‌నాయక్ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌హెంలు, సీఆర్‌పీలు, క్లస్టర్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ చంద్రుడు పాఠ్యపుస్తకాలు అందజేశారు.

ఘనంగా మహేంద్రనాథ్ జయంతి



అచ్చంపేట పట్టణంలో మాజీ మంత్రికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ, నాయకులు

అచ్చంపేట: పట్టణంలో మాజీ మంత్రి మహేంద్రనాథ్ 98వ జయంతి వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంద మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు కాశన్నయాదవ్, రాములు, మహబూబ్ అలీ, తిరుపతయ్యగౌడు, రాజ్‌గోపాల్, అజయ్, మహేష్, గణేష్, విష్ణు, గౌస్, శ్రీకాంత్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: స్వర్గీయ మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ ఆశయాలు, ఆలోచనలు అందరికి ఆదర్శమని అచ్చంపేట ఆర్డీఓ మాధవి అన్నారు. పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచ్చంపేట అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు మస్తాన్, నాసరయ్య, విజయ్‌మోహన్, బాలకృష్ణయ్య, మహేష్, రవి, మహబూబ్ అలీ, అనిల్, ఎమ్మార్పీఎస్ జిల్లా సాట కాశీం, పలువురు మాజీ సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లను సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది

అచ్చంపేట రూరల్: నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు పడేస్తే చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుశాంత్ సుఖ్‌దేవ్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని రంగాపూర్ శివారు ఉమామహేశ్వరం ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో ప్లాస్టిక్ వినియోగం వల్ల పెద్దపులుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, యాత్రికులు, దేవాలయ సిబ్బంది ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు, ఆలయ సిబ్బందికి అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు, ఫారెస్ట్ సిబ్బంది జాఫర్, సాధిక్, శివశంకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని పుల్లగిరి గ్రామం బండమీది తండాకు చెందిన శంకర్‌నాయక్ (35) అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శంకర్‌నాయక్ హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. మే 6వ తేదీన తండాకు వచ్చి తల్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వెళ్లారు. అతని తల్లి గత నెల 31న మృతి చెందింది. శంకర్‌నాయక్ ఎంతకీ రాకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్య కాలేదు. దీంతో అతని సోదరుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న బైక్ సీజ్

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ తండాకు చెందిన సూర్య సోమవారం ఉదయం బైక్‌పై సారా తరలిస్తుండగా బైక్ సీజ్ చేసి, సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సారా తయారీ, బెల్లం అమ్మకాలపై దాడులు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని వినతి



కల్వకుర్తిరూరల్: డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని అర్హులతో కలిసి సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అర్హులకు కేటాయించపోవడంతో అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లయ్య, పద్మ, జయమ్మ, భాగ్యమ్మ, నర్సింహా తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి అధికారులు గైర్హాజరు

కోడేరు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. గ్రామాల ప్రజలు నుంచి ఫిర్యాదులు తీసుకోవాల్సిన అధికారులు ప్రజావాణికి గైర్హాజరయ్యారు. అధికారులు లేకపోవడంతో ఫిర్యాదు దారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. దీంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణికి ధరణి సమస్యలపై రెండు ఫిర్యాదులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మీ తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతి



తెలకపల్లి: రాష్ట్ర వ్యవసాయ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు సవాల్‌లు అనే అంశంపై రాష్ట్ర కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి సీతక్క హాజరయ్యారు. కార్మిక సంఘం నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న సీనియర్ మేట్లను క్షేత్రసహాయకులుగా గుర్తించాలని కోరారు. జిల్లా కార్యదర్శి నందిపేట భాస్కర్, అర్చన, మండల నాయకులు లాల్‌గౌడ్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయికి పూజలు



ఊర్కొండపేటలో బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



బల్మూరులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బల్మూర్: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయికి జలాభిషేకం చేశారు. బోనాల పండుగను జరుపుకున్నారు. గ్రామ దేవత పోచమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో ఆడపడచులు, బంధువులతో పండుగ వాతావరణం నెలకొంది.

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో బొడ్రాయి, నాగులు, పోతురాజు దేవతల రెండో వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, 11 కలశాలతో, గ్రామ మహిళలతో బొడ్రాయికి జాలాభిషేకం, చేశారు. అనంతరం బొడ్రాయి దేవతకి బోనాలు సమర్పించారు. నర్సి రెడ్డి, మనోహర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, అంజయ్య, అబ్దుల్ సమ్మి, వహిదోద్దీన్, రవీందర్, అశోక్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తన నమూనాల సేకరణ



తిమ్మాజిపేటలో విత్తన నమూనాలు సేకరిస్తున్న అధికారులు



కుప్పగండ్లలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ మంజుల

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని పలు వ్యవసాయ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు ఆయా విత్తనాల నమూనాలను సేకరించారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ దుకాణాల నుంచి సేకరించిన పత్తి విత్తనాలతో పాటు ఆయా పంటలకు సంబంధించిన విత్తనాలను సేకరించి ప్రయోగశాలకు విత్తన నాణ్యత పరీక్షల కోసం పంపించనున్నట్లు తెలిపారు. విత్తన నిల్వల వివరాలు, వాటి ఇన్వాయిస్‌లు, లాట్ సంఖ్య వివరాలను పరిశీలించారు. ఏఈవో సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో విత్తనాల, ఎరువుల దుకాణాలను ఏఓ మంజుల తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందించి, సంతకాలు చేయించాలన్నారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విజయలక్ష్మి, డీలర్ అశోక్, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



గోవిందాయిపల్లిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి



లింగాల మండలం అప్పాయిపల్లిలో



గౌరెడ్డిపల్లిలో ..

తాడూరు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు, గోవిందాయిపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, ఉచిత పాఠ్య పుస్తకాలు సౌకర్యాలు ఉంటాయన్నారు. చదువు ప్రాధాన్యాన్ని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఒక్కరోజే 20 మంది విద్యార్థులు బడిలో చేరినట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ఇప్పటివరకు బడిబాటలో 40 మంది విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారని పేర్కొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరెడ్డిపల్లిలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అప్పాయపల్లి, శ్రీరంగాపూర్, చెన్నంపల్లి, పద్మన్నపల్లి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బడిబయట ఉన్న పిల్లలను గుర్తించారు. హెచ్‌ఎంలు శేఖర్, గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హమాలీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: హమాలీలకు రేట్ల ఒప్పందం గడువు ముగిసి ఆరు నెలలు కావొస్తున్న నేటికి కొత్త రేట్ల ఒప్పందం చేయకపోవడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొలడుగు సుధాకర్ అన్నారు. సోమవారం సివిల్‌సప్లై హమాలీ కార్మికులు నిర్వహించిన కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సివిల్‌సప్లై జీసీసీ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని బయోమెట్రిక్ విధానం వల్ల పెరిగిన పనిభారానికి అనుగుణంగా ఎగుమతి, దిగుమతి రేట్లు రూ.26 నుంచి రూ.35 లకు పెంచాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలయ్య, శ్రీనివాసులు, పర్వతాలు, యూనియన్ నాయకులు యాదయ్య, గంగయ్య, చంద్రయ్య, గోపాల్, వెంకటయ్య, రామచంద్రి పాల్గొన్నారు.

సిర్సవాడ-బాదేపల్లి బస్సు సర్వీస్ పునఃప్రారంభం



మాదారంలో బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఊర్కొండ/తాడూరు: మండలంలోని మాదారంలో సోమవారం సిర్సవాడ- బాదేపల్లి ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు పునః ప్రారంభించారు. ఈ బస్సు సర్వీస్ ను అకారణంగా తొలగించడంతో సుమారు 25 గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బొల్లం నరేందర్ సమస్యను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి బస్సు సర్వీసు పునః ప్రారంభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా తాడూరు మండలంలోని కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కల్వకుర్తి నుంచి సిర్సవాడ, పాపగల్, జడ్చర్ల మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు కల్వకుర్తి బస్సును ప్రారంభించారు. బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

కోడేరు: మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ మల్లేపల్లి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా జగన్ అన్న యువసేన అధ్యక్షుడు వీరపాగ శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి ఘన నివాళి

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు సులిగిరి పెంటమ్మ ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నల్లమల వాసికి నేషనల్ నంది అవార్డు



మన్ననూర్: వల్లూరి ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కవి, గాయకుడు, దళిత రత్న, జాతీయ అవార్డు గ్రహీత మాడ్గుల నర్సింహకు రవీంద్రభారతిలో బంగారు నంది అవార్డు ప్రదానం చేశారు. సామాజిక రుగ్మతలు, జానపద కళా ప్రదర్శనలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై 30 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డును అందుకున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో నల్లమల కీర్తి ప్రతిష్టలను నిలిపిన ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.